సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



కనులపండువగా కాళభైరవ జయంతి

సిరిసిల్లటౌన్: గాంధీనగర్‌లోని రుక్మిణీవిఠలేశ్వర భక్తాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం శ్రీకాళభైరవస్వామి జయంతి నేత్రపర్వంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆడెపు రవీందర్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, కౌన్సిలర్ దార్నం అరుణ, ఆలయ అధ్యక్షుడు వడ్లకొండ ఆనందం, కార్యదర్శి కుడిక్యాల శంకర్, ఉపాధ్యక్షుడు కోడం అమర్‌నాథ్, సహాయ కార్యదర్శి పత్తిపాక వేణుగోపాల్, కోశాధికారి కోమాకుల ఆంజనేయులు, శ్రీపతి పరుశురాం, పంతం రవి, కోడం నారాయణ, తడుక విశ్వనాథం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పీవీకి ఆది నివాళి



నివాళి అర్పిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతిని అసెంబ్లీ లాంజ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇల్లంతకుంటలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నీని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్ పాల్గొన్నారు.


ఓటుహక్కు తొలగించడం నేరం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులకు అండగా నిలుస్తూ అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని తంగళ్లపల్లి బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సందర్భంగా మాట్లాడారు. మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు మాట్లాడుతూ తమ గ్రామంలో 82 మంది ఓట్లను అకారణంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. బతుకుదెరువు కొరకు ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్తే ఓట్లు తొలగించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. ఓట్ల గల్లంతు, అక్రమ తొలగింపులపై విచారణ చేపట్టాలని కోరారు. మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

31లోపు రబీ టెండర్‌లను పూర్తి చేయాలి



సిరిసిల్లకల్చరల్: రబీ 2022–23 టెండర్ డెలివరీస్‌ను ఈనెల 31లోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ నెలాఖరులోపు డెలివరీస్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి పి.వసంతలక్ష్మి, మేనేజర్ రజిత, డిప్యూటీ తహసీల్దార్లు నవీన్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

‘లెక్క’ చెప్పరు.. సహకరించరు!

- శాతవాహన వర్సిటీలో తేలని బిల్లుల లొల్లి
- ‘విజిలెన్స్’ అడిగినా నేటికీ సమర్పించని వర్సిటీ
- దాదాపు రూ.50 కోట్ల భవనాల బిల్లులపై నాన్చుడు ధోరణి
- టెండర్లు ఏకపక్షంగా కట్టబెట్టిన వైనం
- తవ్వుతున్న కొద్దీ వెలుగుచూస్తున్న అధికారుల అవకతవకలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: శాతవాహన వర్సిటీలో గతంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణలో తవ్వినకొద్దీ కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. దాదాపు ఆర్నెళ్ల క్రితం మొదలైన విజిలెన్స్ విచారణ నేటికీ ముందడుగు పడడం లేదు. విచారణ అధికారులు ఎక్కడికక్కడ ఆధారాలు సేకరిస్తుంటే.. మరోవైపు వర్సిటీ అధికారులు సహకరించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయని ఈ ఏడాది జూన్18న హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లోగల విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో కరీంనగర్‌కు చెందిన కొందరు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో నిజానిజాలు ఏంటో తేల్చాలంటూ అక్కడ నుంచి స్థానిక విజిలెన్స్ కార్యాలయానికి సదరు ఫిర్యాదును బదిలీ చేశారు.

మొదటి నుంచీ అరకొరే

సదరు ఫిర్యాదు మొత్తం 160 పేజీల మేర ఉంది. ఇందులో అనేక అంశాల ప్రస్తావన ఉంది. భవన నిర్మాణాలు, పేపర్ వాల్యుయేషన్, టెండర్లు పిలవకుండా కాంట్రాక్టులు కట్టబెట్టడం, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం, పాలకమండలిలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు తదితరాలలోని లోపాలను ఎత్తిచూపాయి. వాస్తవానికి విజిలెన్స్ వద్ద తగినంత సిబ్బంది లేని కారణంగా ఫిర్యాదు అధ్యయనానికే దాదాపు రెండు నెలలు పట్టింది. ఎందుకంటే.. ఇందులో సివిల్, ఆడిటింగ్, టెండర్లు తదితర విభిన్న అంశాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయా అంశాల్లో నిపుణులతో భేటీ అయి, వారి అభిప్రాయాలు తీసుకుని విచారణ ప్రారంభించారు. వాటి ఆధారంగా అధికారులకు ప్రశ్నావళి రూపొందించి పంపారు. దీనికి పైఅధికారులు అనుకున్నంత వేగంగా స్పందించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తానికి అరకొర సమాధానాలు ఇస్తూ.. దర్యాప్తునకు పెద్దగా సహకరించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.50 కోట్ల వరకు బిల్లులు

గత పాలకమండలి సమయంలో నిర్మించిన భవనాల విషయంలోనూ అవకతవకలు ఉన్నాయని విజిలెన్స్‌కు ఫిర్యాదు వచ్చింది. వీటి విషయంలో స్పష్టత కోసం విజిలెన్స్ వాటి బిల్లులు సమర్పించాలని అధికారులను కోరింది. అయితే.. ఈ విషయంలో అధికారులు నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని సమాచారం. దాదాపు రూ.50 కోట్లకు సంబంధించి బిల్లుల చెల్లింపుపై ఇంతవరకూ విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈ విషయంలో విజిలెన్స్ అధికారులు వర్సిటీ అధికారులను తరచూ సంప్రదిస్తున్నా.. రేపు, మాపు అంటూ జాప్యం చేస్తున్నారు తప్ప ఇవ్వడం లేదని విజిలెన్స్ అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో రూ.50 కోట్ల వరకు భవనాలకు సంబంధించిన బిల్లులు ఇంతవరకూ ఎందుకు ఇవ్వడం లేదన్న విషయంలోనూ విజిలెన్స్ పలు అనుమానాలు వ్యక్తం చేస్తోంది. టెండర్ల విషయంలోనూ గత పాలకులు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలు కూడా క్రమంగా బలపడుతున్నాయి. వర్సిటీకి సంబంధించిన కొన్ని పనుల్లో టెండర్లు పిలవకుండానే.. తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇచ్చేసినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ విషయంలో ముఖ్యంగా పేపర్ వాల్యుయేషన్‌లో ఏకపక్షంగా వ్యవహరించిన తీరుపై గతంలో ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. ఉద్యోగుల నియామకంలోనూ పాలకమండలి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ విషయాల్లోనూ కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ప్రజావాణిలో 142 అర్జీలు స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: ప్రజాసమస్యలు పరిష్కారమే ప్రజావాణి లక్ష్యమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూకు 58, సిరిసిల్ల మున్సిపల్‌కు 20, ఎస్‌డీసీకి 10, ఎస్పీకి 7, విద్యాశాఖ, జిల్లా పంచాయతీ అధికారికి 4 చొప్పున, ఎల్‌డీఎం, వేములవాడ మున్సిపల్, ఉపాధి కల్పన శాఖకు 3 చొప్పున, డీసీఎస్‌వో, జిల్లా సంక్షేమాధికారి, ఎంపీడీవో కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, బోయినపల్లికి 2 చొప్పున, ఎంపీడీవో ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, ఇరిగేషన్, జిల్లా వైద్యాధికారి, వ్యవసాయాధికారి, డీఎం డబ్ల్యూవో, సెస్, డీటీడబ్ల్యూవో, హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్, డీపీఆర్వో, డీఎస్‌సీడీవో, ఎస్సీ కార్పొరేషన్, ఆర్డీసీ సిరిసిల్ల, డీబీసీడీవో ఒకటి చొప్పున మొత్తం 142 దరఖాస్తులు వచ్చాయి.

పాస్‌బుక్ ఇప్పించాలి



మా గ్రామంలో సర్వేనంబరు 434లో 1.35 ఎకరాల భూమి ఉంది. నాకు పట్టాదార్ పాస్‌బుక్ రాలేదు. ధరణిలో టీఎం33 మాడ్యుల్‌లో మిస్సింగ్ సర్వే కింద అప్లయ్ చేసిన. ఇప్పటికీ మూడు నెలలైంది. నాపేరు మీద భూమి ఎక్కలేదు. కలెక్టర్ స్పందించి పాస్‌బుక్ ఇప్పించాలి. – మారుపాక పద్మ, నిమ్మపల్లి

పింఛన్ ఇప్పించాలి..



మాది ఇల్లంతకుంట దాచారం. నాకు నాలుగు నెలలుగా పింఛన్ రావడం లేదు. పంట రునం ఉందని నాకు తెల్వకుండానే పింఛన్ నిలిపివేశారు. పింఛన్‌పై ఆధారపడిన నాకు ఎప్పటిలాగే ఇప్పించండి. – పోలంపల్లి విమల, ఇల్లంతకుంట

అనుమతి లేని నిర్మాణంపై చర్యలేవి?



గ్రామ శివారులోని సర్వేనంబరు 62/14లో గతంలో కారోబార్‌గా పనిచేసిన వ్యక్తి 20 గుంటల భూమిని కబ్జా చేశారు. అక్రమంగా ఆక్రమించుకున్న భూమికి చుట్టూ కంచె వేసి అనుమతి లేకుండానే దుకాణాలు నిర్మించిండు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి. – బర్కం వెంకటలక్ష్మి, పెద్దూరు

బ్రిడ్జి పనులు పూర్తిచేయండి



బోయినపల్లి మండలం గంజివాగు వద్ద హైలెవల్ బ్రిడ్జి పనులు మధ్యలోనే నిలిపివేశారు. వర్షాకాలంలో చుట్టుపక్కల 40 గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. వెంటనే బ్రిడ్జి పనులు పూర్తిచేయించాలి. – అక్కెనపల్లి కరుణాకర్, స్తంభంపల్లి, మాజీ సర్పంచ్

రైతువేదికకు నిధులివ్వండి



గ్రామ పంచాయతీ పరిధిలోని ఐకేపీ సెంటర్‌లో రైతువేదిక నిర్మించడం లేదు. ఈ నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. వెంటనే నిధులు కేటాయించి రైతువేదిక భవనాన్ని పూర్తి చేయించాలి. – చిట్నేని శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీటీసీ, గూడెం

తప్పు చేస్తే.. శిక్ష తప్పదు

- కోర్టులో సాక్ష్యాలు, ఆధారాలు
- నేర నిరూపణకు ఖాకీల కసరత్తు
- జిల్లాలో వరుసగా తీర్పుల వెల్లడి
- జైలుకు వెళ్తున్న నేరస్తులు
- నిత్యం సమన్వయంతో సత్ఫలితాలు
- ఎస్పీ అఖిల్ మహాజన్



చిన్న తప్పే.. తరచూ చేసి..

సిరిసిల్లలోని ఓ యువకుడు మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డాడు.కోర్టులో హాజరై జరిమానా, క్షమాపణ చెబితే సరిపోతుందనుకున్నాడు. ఇలా పలుమార్లు పట్టుబడడం మళ్లీ మద్యం తాగి బైక్ నడపడం పరిపాటిగా మారింది. పోలీసుల రికార్డుల్లోని వివరాల ఆధారంగా మరోసారి పట్టుపడిన మందుబాబుకి జడ్జి ఒక రోజు జైలు శిక్ష వేయడంతో అసలు కథ అర్థమైంది. చిన్నతప్పిదమైనా పదే..పదే చేస్తే శిక్ష తప్పదని తెలిసిపోయింది.

వెదికి మరీ..

వేములవాడ డివిజన్ పరిధిలో ఒకరు హత్య చేసి వెంటనే గల్ఫ్ దేశానికి పరారయ్యాడు. ఓ పదేళ్లు గడిస్తే కేసు విషయాన్ని మరిచిపోతారని నేరస్తుడు భావించాడు. కానీ పోలీసులు తమ అధికారాలను ఉపయోగించి గల్ఫ్ దేశం నుంచి రిప్పించి, రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. అంటే నేరాలు చేసి ఎక్కడికి పోయిన ఏదో ఒక రోజు పట్టుబడడం ఖాయమని, జైలుకెళ్లడం తప్పదని ఈ సంఘటనతో తేలిపోయింది.

సిరిసిల్లక్రైం: తప్పు.. అంటే తప్పే. నేరం చిన్నదైనా.. పెద్దదైనా శిక్ష అనుభవించాల్సిందే. నేరాన్ని బట్టి శిక్ష అమలవుతుంది. నేరం చేసి ఇతర దేశాలకు పారిపోదామనుకుంటే పొరబాటు పడ్డట్లే. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన పోలీసులు పట్టుకొస్తున్నారు. ఒక తప్పు చేసినా.. రెండు తప్పులు చేసినా శిక్ష ఒకటే అనే భావన కరెక్ట్ కాదని పలు సంఘటనలు నిరూపిస్తున్నాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని, పౌరులు బాధ్యతగా బతకాలని ఇటీవల జరిగిన సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

సాంకేతికతతో విచారణ

గతంలో నేరం జరిగితే దానిని నేరుగా చూసిన వాళ్లు వచ్చి కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి ఉండేది. నేరం జరిగిన ప్రాంతంలో నిందితుడు ఉన్నాడా? లేదా? అనేది కూడా ఎవరైన చూసి ఉండి.. కోర్టులో సాక్ష్యం చెప్పాలి. కానీ నేడు పరిస్థితి మారిపోయింది. నేరస్థలంలో సదరు వ్యక్తి ఉన్నాడా? లేదా? అని తెలుసుకునేందుకు నిందితుడు వాడే సెల్‌ఫోన్, సదరు ఏరియాలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలు, ఫోరెన్సిక్ ల్యాబ్, డాగ్‌స్క్వాడ్ వంటి వాటిని వినియోగిస్తున్నారు.

సమన్వయంతో సత్ఫలితాలు

- నేరం జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు, చార్జిషీట్ దాఖలు, పక్కాగా సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపిస్తే వంద శాతం శిక్షలు పడడం ఖాయమని సీనియర్ పోలీసులు చెబుతున్నారు.
- కేసుల నమోదు, విచారణలో నాణ్యత పాటించాలని, సాంకేతికతను వినియోగించాలని పదే..పదే పోలీస్ ఉన్నతాధికారులు పలు సమీక్షల్లో దిశనిర్దేశం చేస్తున్నారు.

శిక్షపడిన వ్యవధి	2022	2023	2024
జీవిత ఖైదీ	–	3	3
10 ఏళ్లు	–	1	2
7 ఏళ్లు	1	1	2
5 ఏళ్లు	–	2	1
3 ఏళ్లు	3	4	10
2 ఏళ్లు	4	2	6
ఏడాది	11	18	36
ఏడాదిలోపు	15	27	19

నిందితులకు శిక్షపడేలా కృషి



కేసు నమోదు, నిరూపణ అనేది పెద్ద పనులు. కేసుల్లో విజయం సాధించాలంటే పక్కాగా సాక్ష్యాలను సమకూర్చుకోవాలి. కోర్టులో సకాలంలో ప్రవేశపెట్టాలి. వీటన్నింటిని సమన్వయం చేయడానికి నిత్యం పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, కోర్టు విధులు నిర్వహించే పోలీసు అధికారులను, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వెళ్తున్నాం. ఇటీవల వెలువడిన పలు కేసు తీర్పుల్లో పదేళ్ల జైలు, నగదు జరిమానా పడినవి ఉన్నాయి. తప్పు చేయాలనే ఆలోచన రావద్దనే పోలీస్‌శాఖ పనిచేస్తుంది.
– అఖిల్‌మహాజన్, ఎస్పీ

కాంగ్రెస్ హామీలు ఉత్తకోతలే..

- కాళేశ్వరంపై ప్రభుత్వానికి అవగాహన లేదు
- మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్లటౌన్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఉత్తకోతలేనని తేలిపోయాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ ఎద్దేవా చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవనంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వ రం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులకు ఏమాత్రం అవగాహన లేదన్నారు. మేడిగడ్డను వెంటనే మరమ్మతు చేయించి, గోదావరి జలాలను ఎత్తిపోయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు మినహా ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి పూర్తి చేయలేదన్నారు. రేవంత్ సర్కార్ ఏడాది పాలనలో విఫలమైందన్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలపై భూకబ్జాల కేసులు కక్షసాధింపు చర్యల్లా ఉన్నాయన్నారు. టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, గుండ్లపెల్లి పూర్ణచందర్, కుంభాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నాం

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇందిరమ్మకాలనీ గ్రామపంచాయతీలో ఇళ్ల సర్వే కోసం దరఖాస్తుదారులను గ్రామపంచాయతీకే రమ్మంటున్నారని తెలుపుతూ ‘ఇందిరమ్మ సర్వే.. ఆఫీస్‌కు రావాలట !’ శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ వివరణ ఇస్తూ 1, 2, 3, 4, 5 వార్డుల్లో ఇప్పటికే ఇళ్లకు వెళ్లి సర్వే చేసినట్లు తెలిపారు. స్థానికంగా ఉండని వారి కోసమే కార్యదర్శి వాట్సాప్ మెసేజ్ చేయాల్సి వచ్చిందన్నారు. కార్యదర్శి పెట్టిన వా ట్సాప్ మెసేజ్‌లో సగం మాత్రమే ప్రచురితమైందని పూర్తి మెసేజ్ ఎంపీడీవోకు పంపినట్లు పేర్కొన్నారు.



గురిపెడితే పతకమే..

సిరిసిల్లటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్ ఆర్చరీ పోటీలు సోమవారం స్థానిక మినీస్టేడియంలో నిర్వహించారు. కరీంనగర్ ,పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల బాలబాలికలు పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్ 20 మీటర్లు, 30 మీటర్స్, రికర్వ్ 60+60 మీటర్లు, కాంపౌండ్ 50+50 మీటర్ల విభాగాలలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీకుమార్, కరీంనగర్ ఆర్చరీ కోచ్ డి.శ్రీనివాస్, సిరిసిల్ల ఆర్చరి హరీశ్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, ఆర్చరీ కోశాధికారి దేవత ప్రభాకర్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, వాసం రాజేశం, సతీశ్, చందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్




వైద్యసేవలు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పోలీస్‌శాఖ పనిచేస్తోందని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. లింగన్నపేట పరిధిలోని ఎర్రశెలక తండాలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 300 మందికి వైద్యపరీక్షలు చేసి, మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై శ్రీకాంత్, ఎల్లారెడ్డిపేట అశ్విని హాస్పిటల్ వైద్యబృందం పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు 23 ఫిర్యాదులు

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీస్ ఆఫీస్‌లో ప్రతీ సోమవారం నిర్వహించిన 23 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఫిర్యాదారులతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. భూతగాదాలు, సివిల్ కేసుల్లో చట్టపరిధిలో సలహాలు, సూచనలు చేస్తూ ముందుకెళ్లాలని సూచించారు.

నిరసనలు.. నినాదాలు



నల్లని దుస్తుల్లో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: నిరసనలు.. నినాదాలతో సోమవారం కలెక్టరేట్ ప్రాంగణం హోరెత్తింది. ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్ష సోమవారం నాటికి 14వ రోజుకు చేరింది. దీక్షలో భాగంగా కలెక్టరేట్ గేట్ ఆర్చి వద్ద నల్లదుస్తులతో నిరసన తెలిపారు. సమగ్ర శిక్షను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. ముస్తాబాద్ డీటీఎఫ్ మండల బాధ్యులు బాదవేణి అంజయ్య సంఘీభావం తెలిపారు.

- ప్రభుత్వ వస్త్రాల తయారీలో పాల్గొనే కార్మికులకు రోజుకు రూ.వెయ్యి చొప్పున వేతనం వచ్చేలా కూలి నిర్ణయించాలని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు వినతిపత్రం అందించారు. అన్నల్‌దాస్ గణేశ్, సత్యం, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.
- సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు పండ్లు, కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్ల బాధలు పట్టించుకోవాలని సప్లయర్స్ ఎల్లయ్య, సంతోష్, భాస్కర్, నాగరాజు కోరారు.
- వేతనాలు ఇప్పించాలని ఇల్లంతకుంట మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలోని స్కావెంజర్లు కోరారు. ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. దండి లక్ష్మి, బాలలక్ష్మి, శోభ ఉన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటకు చెందిన జంగిటి చిన్ననర్సయ్య (45) ఆత్మహత్య చేసుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చిన్ననర్సయ్య రాజేశ్వర్‌రావుపేట శివారులో అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. రెండు రోజుల క్రితం వాటికి తగిలి, విద్యుదాఘాతంతో గ్రామానికే చెందిన నవీన్ మృతిచెందాడు. తన భర్త మృతికి కారణమైన చిన్ననర్సయ్యపై చర్యలు తీసుకోవాలంటూ మృతుడి భార్య ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో భయాందోళనకు గురైన చిన్ననర్సయ్య సోమవారం తన పొలానికి సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన సత్తయ్య

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన పంజాల సత్తయ్య అనే గీత కార్మికుడు గాయపడ్డాడు. సోమవారం ఉదయం కల్లు గీసేందుకు వెళ్లిన ఆయన తాటిచెట్టు సగం వరకు ఎక్కాక మోకు జారడంతో కిందపడ్డాడు. గాయపడిన సత్తయ్యను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

శతాధిక వృద్ధురాలి మృతి

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కాసారపు ఐలయ్య తల్లి ఐలమ్మ(108) సోమవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఆమె అస్వస్థతకు గురైందన్నారు. మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

వీణవంక(హుజూరాబాద్): వీణవంక మండలంలోని చల్లూరుకు చెందిన మత్తమారి ఓదెలు(73) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. ఓదెలు ఈ నెల 13న తన వ్యవసాయ బావి వద్ద పైపులు అతికించేందుకు నిప్పంటించాడు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, అతనికి అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావుసాయిపేట మాజీ సర్పంచ్ రిమాండ్

కోనరావుపేట(వేములవాడ): బావుసాయిపేట మాజీ సర్పంచ్ కెందె గంగాధర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర్ అట్రాసిటీ కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆయనను సోమవారం కరీంనగర్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మక్కకు 'కత్తెర' కాటు

- మొక్కజొన్న రైతులను కలవరపెడుతున్న పురుగు
- రసాయన మందులకే వేలల్లో ఖర్చు
- జిల్లాలో 50వేల ఎకరాల్లో పంట సాగు


పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు


మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో రబీ సీజన్‌లో ఆరుతడి పంటగా సాగుచేసిన మొక్కజొన్న పంటకు పురుగుల బెడద ఇబ్బందికరంగా మారింది. పంట దిగుబడి ఏమోగాని.. పంట సాగు చేసిన రైతులకు మాత్రం కత్తెర పురుగు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రసాయన మందులు పిచికారీ చేస్తున్నా.. పురుగు ఉధృతి ఆగడం లేదని రైతులు చెబుతున్నారు.

విజృంభించిన కత్తెర పురుగు

వానాకాలంలో సాగు చేసిన వరి స్థానంలో.. పంట మార్పిడి చేసి రైతులు ఒక్క జగిత్యాల జిల్లాలోనే 50వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వరి కోశాక.. పొలాలు దున్నకుండానే నవంబర్, డిసెంబర్‌లో మొక్కజొన్న పంట విత్తారు. ఆ పంటను కత్తెర పురుగు చేను 15 నుంచి 20 రోజుల తొలి దశ నుంచే ఆశించి చివరి దశ వరకు ఉంటుంది. ఈ పురుగు మూడు దశల్లో పంటను ఆశించి, ఆకులను తినడంతో రంధ్రాలు ఏర్పడి మొక్క మొగి కుళ్లిపోతుంది. పురుగు మొగిలోకి చొరబడి పంటను ఎదగకుండా చేస్తుంది.

రసాయనాలకు భారీగా ఖర్చు

పంట సాగుకే ఎకరాకు రూ.20వేల వరకు ఖర్చవుతుంటే.. కత్తెర పురుగుతో ఒక్కో రైతు కనీసం ఎకరాకు మరో రూ.10వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇప్పటికే రైతులు రెండుమూడు సార్లు రసాయన మందులు పిచికారీ చేశారు. మొక్క మొగిలో గుళికలు కూడా వేస్తున్నారు. పిచికారీ చేసేందుకు కూలీల ఖర్చు కూడా రైతులకు తడిసి మోపడవుతోంది. అయినప్పటికీ పురుగు ఉధృతి ఆగకపోవడంతో ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తొలిదశలో నివారిస్తేనే లాభం

లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగు జీవిత కాలం 60 రోజుల వరకు ఉంటుంది. తల్లి పురుగులు (రెక్కల పురుగులు) గుంపులు, గుంపులుగా మొక్కజొన్న కర్రపై గుడ్లను పెడుతుంటాయి. ఒక్కో గుంపులో 1500 నుంచి రెండువేల వరకు గుడ్లు పెడుతాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చిన తర్వాత పురుగులు మొక్క ఆకులను గోకి తింటుండటంతో ఆకులకు రంధ్రాలు ఏర్పడతాయి. పురుగు పెద్దది అవుతున్న కొద్దీ మొక్క సుడిలోకి ప్రవేశించి పంటకు తీవ్ర నష్టం చేస్తాయి. ఇందుకోసం ఎకరాకు 5 నుంచి 6 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవడంతో పాటు మధ్యస్థ దశలో వేపనూనె పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

రెండు, మూడు సార్లు పిచికారీ చేసిన



మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించడంతో ఇప్పటికే రెండు, మూడుసార్లు రసాయన మందులు పిచికారీ చేశాను. మందులు, కూలీలకు కలిపి రూ.10వేల వరకు అదనంగా ఖర్చయ్యింది. అయినా మొక్కజొన్న ఆకులకు ఇంకా రంధ్రాలు చేస్తూనే ఉన్నాయి.

– గడ్డం గంగారెడ్డి, వల్గల్

పురుగు ఉధృతిని నివారించాలి..



పంట వేసినప్పటి నుంచే కత్తెర పురుగు ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలు తీసుకోవాలి. గుడ్ల దశలోనే నివారిస్తే పెద్దగా ఇబ్బంది ఉండదు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చిన తర్వాత ఎక్కువ నష్టం కలిగిస్తాయి. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

– శ్రీనివాస్, పొలాస పరిశోధన స్థానం డైరెక్టర్

బస్టాండ్‌లలో మహిళా దొంగలు

- జగిత్యాలలో ఒకరి అరెస్టు
- 31.50 తులాల బంగారం స్వాధీనం
- పరారీలో మరో ముగ్గురు
- డీఎస్పీ రఘుచందర్


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు


అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం: బస్టాండ్‌లలో మహిళా ప్రయాణికులే టార్గెట్‌గా పలువురు మహిళా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఒకరిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సిటీ రామేశ్వరి టోలి ప్రాంతానికి చెందిన హత్లడే కాంత, స్వప్న మిథస్, హతడే గుజానా, సంజన నాడే కలిసి, ముఠాగా ఏర్పడ్డారు. నాగ్‌పూర్ నుంచి మంచిర్యాలకు రైలులో వచ్చారు. మంచిర్యాల, లక్షెట్‌పేట్, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల్లోని బస్టాండ్‌లలో మహిళా ప్రయాణికులపై నిఘా పెట్టి, కొంతకాలంగా బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్నారు. ఈ నెల 16న జగిత్యాల పాత బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా.. 37 తులాల బంగారు ఆభరణాలున్న ఆమె బ్యాగును దొంగిలించారు. చోరీ చేసిన బంగారాన్ని సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీరామనగర్‌లో విక్రయించేందుకు రాగా, హత్లడే కాంతను పోలీసులు అరెస్టు చేశారు. 31.50 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారని, వారి వద్ద మరో 7 తులాల బంగారం ఉన్నట్లు తెలిసిందని, త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్, ఎస్సై కిరణ్, ఎస్సై నజీర్‌ఖాన్, కానిస్టేబుల్ జీవన్‌లను ఆయన అభినందించారు.

ప్రశాంతంగా వుషు ఎంపిక పోటీలు


ఉమ్మడి జిల్లా జట్టుతో జనార్దన్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఫండస్ స్కూల్లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీఎం కప్ వుషు ఎంపిక పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. అండర్–14, 18 విభాగాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో రాణించినవారిని ఈ నెల 27 నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఈ పోటీలను తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఫండస్ స్కూల్ చైర్మన్ గోపు ప్రభాకర్ రెడ్డి, వుషు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బార విద్యాసాగర్, జూడో సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, ఎస్జీఎఫ్ కరీంనగర్ అర్బన్ జోన్ కార్యదర్శి శంకరయ్య, వుషు కోచ్ రాణావిక్రమ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సైక్లింగ్ పోటీలు

జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సైక్లింగ్ సంఘం జిల్లా కార్యదర్శి సురబి వేణుగోపాల్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

బాక్సింగ్ పోటీలు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీఎం కప్ బాక్సింగ్ అండర్–14, అండర్–17 బాలబాలికల, సీనియర్స్ పురుషుల ఎంపిక పోటీలను 25న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 91006 68474 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

కరీంనగర్ క్రైం: భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణంలోని హుస్సేనీపురకు చెందిన సయ్యద్ హైదర్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురి భర్త ఇటీవల కేన్సర్‌తో చనిపోయాడు. చిన్న కూతురు పర్వీన్ సుల్తానా భర్త షేక్ రఫీక్ ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై పెద్ద మనుషుల మధ్య పంచాయితీ జరిగినా అతనిలో మార్పు రాలేదు. 2020 ఏప్రిల్ 24న తెల్లవారుజామున పర్వీన్ సుల్తానా భర్త రఫీక్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన రఫీక్ తన భార్యను కత్తితో పొడిచి, హత్య చేశాడు. మృతురాలి తండ్రి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములు విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి సోమవారం షేక్ రఫీక్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.



ఘనంగా ముందస్తు క్రిస్మస్

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర మైనారిటీ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆదేశాలతో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. సుభాష్‌నగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వేడుకల్లో ఆర్‌డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, మైనార్టీశాఖ అభివృద్ధి అధికారి ఆర్‌వీ రాధాబాయి, ఓఎస్‌డీ సర్వర్‌మియా పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధి వివిధ కాలేజీల్లోని ఎగ్జామినేషన్ సెంటర్లలో సోమవారం మాల్ ప్రాక్టీస్ చేస్తూ 11 మంది విద్యార్థులు పట్టుబడ్డారు. కరీంనగర్‌లో 7, హుజూరాబాద్‌లో 2, జమ్మికుంటలో 1, జగిత్యాలలో 1 కేసులు నమోదయ్యాయని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎస్‌వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుచేయాలి


మాట్లాడుతున్న కల్యాణ్‌కుమార్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కల్యాణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయలన్నారు. కళాశాల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలని కోరారు. అనంతరం కళాశాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ఉపాధ్యక్షులుగా తేజ, శివచరణ్, సహాయ కార్యదర్శిగా మనోజ్, మహిళా కన్వీనర్‌గా దీపిక, కో కన్వీనర్‌గా మల్లిక, జాయింట్ కన్వీనర్‌గా వైష్ణవి, కార్యవర్గ సభ్యులుగా భాను, సాయి, శ్రీకాంత్, అంకిత, సాయి మేఘన ఎన్నికయ్యారు.

ఘనంగా ఉత్తర నక్షత్ర పూజలు


పూజలో పాల్గొన్న మాలధారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలధారులు ఉత్తర నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి వేద పండితులు, మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వామి కందుకూరి రవి, మాలధారులు నారాయణ, నంది నరేశ్, రంజిత్, గిరిధర్ రెడ్డి, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రసాద్

కమాన్‌పూర్(మంథని): ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అతనికి అప్పగించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన వరాల సాత్విక్ తన ఫోన్ పోగొట్టుకున్నాడన్నారు. ఈసీఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయడంతో, ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సోమవారం బాధితుడిని పిలిపించి, అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సంబంధిత వివరాలను ఈసీఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయించాలని సూచించారు.

పంటరుణం తీసుకోని రైతుకు నోటీస్‌లు

- బ్యాంక్ అధికారుల తప్పిదం
- ఆందోళన చెందుతున్న రైతు


నోటీస్ చూపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: తాను తీసుకోని పంటరుణం డబ్బులు చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు నోటీస్‌లు పంపడంపై రైతు ఆందోళనకు గురవుతున్నాడు. జాయింత్ ఖాతా ఫొటో పెట్టి, ఇతర రైతు భూమి పహాణీతో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.50వేలు తీసుకున్నట్లు ఉందని సదరు రైతు ఆరోపిస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లికి చెందిన రైతు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండల కేంద్రంలోని ఐవోబీలో తాను ఎలాంటి పంట రుణం తీసుకోలేదన్నారు. బ్యాంక్ అధికారుల తప్పిదంతోనే తనకు నోటీస్‌లు వచ్చాయని పేర్కొన్నారు. సర్వే నంబర్లు 108, 136, 137లలో దుమాలకు చెందిన బద్దిపడిగె బాపురెడ్డిగా ఉందని, కొండన్నపేట శ్రీనివాస్‌రెడ్డిగా పహాణీలో పేరు మార్చి రుణం మంజూరు చేసినట్లు ఉందని వివరించారు. తన భార్య రజిత జాయింట్ ఖాతాలో 2009, అక్టోబర్‌లో రూ.50 వేలు పంటరుణం మంజూరు చేసినట్లు, జీడీ రెడ్డి సంతకంతో రూ.50 వేలు డ్రా చేసినట్లు ఉందని తెలిపారు. దీనిపై 2013లో నే బ్యాంక్ కేంద్రం కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అధికారులు విచారణ చేపట్టి ఆ రుణంతో తనకు సంబంధం లేదని తేల్చి చెప్పారన్నారు. తన ఇబ్బందులను బ్యాంక్ అధి కారులు గుర్తించి, తనకు న్యాయం చేయాలని కోరారు.

గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్


అరెస్ట్‌ను చూపుతున్న సీఐ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తంగళ్లపల్లికి చెందిన గుంటి అభిలాశ్(19), తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్‌పార్క్‌కు చెందిన కనుకుంట్ల మహేశ్(28) మండలంలోని తాడూరు ఎల్లమ్మ గుడివద్ద గంజాయి తాగుతూ, అమ్ముతూ పట్టుబడ్డారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



డిగ్రీ విద్యార్థుల ఆందోళన


పరీక్ష కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు

జమ్మికుంట: పట్టణంలోని ఓ డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రంలో డిగ్రీ విద్యార్థుల ఆందోళన చేపట్టారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు సోమవారం పరీక్షకు ఉదయం 8.30 గంటలకు రావాల్సి ఉండగా 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రం నిర్వాహకులు గేటు మూసివేశారు. విద్యార్థులు వాగ్వాదానికి దిగడంతో ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ వంశీకృష్ణ పరీక్షల అబ్జర్వర్ అనితను సంప్రదించి, వారిని పరీక్షకు అనుమతించడంతో వివాదం సద్దుమణిగింది.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి వద్ద పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గం దాటి ఇసుక తరలిస్తుండగా వాహనాలను సీజ్ చేసి, తసహీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఇల్లంతకుంట : మండలంలోని కందికట్కూర్, పెద్ద లింగాపూర్, సోమారంపేట, పొత్తూరు, రేపాక, తదితర గ్రామాలకు చెందిన 48 కల్యాణ లక్ష్మి చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పసుల వెంకటి, అనంతగిరి వినయ్ కుమార్, ఉప్పల అమర్ , యాస తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే


కోడె మొక్కు చెల్లించుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్

వేములవాడ : వేములవాడ రాజన్నను సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్ సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ప్రొటోకాల్ ఏఈవో అశోక్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

సిరిసిల్ల యువకుడికి డాక్టర్ పట్టా


పట్టా అందుకుంటున్న సుమంత్

సిరిసిల్లకల్చరల్: కార్మికక్షేత్రంలో పుట్టిపెరిగిన యువకుడు హోమియోపతి డాక్టర్ పట్టా అందుకున్నాడు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఆర్‌ఎంపీగా సేవలందిస్తున్న అలువాల ఈశ్వర్ కొడుకు సుమంత్ డాక్టర్ పట్టా అందుకున్నాడు. ఒంటిమామిడిలోని హంస హోమియోపతి మెడికల్ కాలేజీలో సోమవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో ఈ పట్టా అందుకున్నాడు.

చంపుతానని బెదిరించిన వ్యక్తి అరెస్టు

చందుర్తి(వేములవాడ): వ్యవసాయ భూమిలో పంట సాగును అడ్డుకోవడమే కాకుండా చంపుతానని బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని అనంతపల్లికి చెందిన సలేంద్ర మల్లయ్య వద్ద ఇదే గ్రామానికి చెందిన సిందరవేణి నారాయణ 1.35 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. సోమవారం తన భార్య సత్తవ్వ, కొడుకు శ్రీధర్‌లతో కలిసి అందులో సాగు పనులు చేస్తున్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన అనంతపల్లికే చెందిన సలేంద్ర గంగయ్య, గంగవ్వ వారిని అడ్డుకున్నారు. చంపుతామని బెదిరించారు. దీంతో నారాయణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. గంగయ్యను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.